క్లుప్తంగా

ఎరువుల అధిక వినియోగంతో అనర్థాలు



మునగాలలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

మధురపూడి: సాగులో మోతాదుకు మించి ఎరువులను వాడడం సరికాదని వ్యవసాయశాఖ సాంకేతిక సలహా కేంద్రం జిల్లా అధికారి నందకిషోర్ అన్నారు. కోరుకొండ మండలం మునగాల గ్రామంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిషోర్ రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. చేనులో అధిక నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడీఏ బీకే మల్లికార్జున రావు మాట్లాడుతూ పురుగు మందు పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆ శాఖ మండలాధికారి ఏ.గౌరీ దేవి, ఎంపీటీసీ చింతాకుల లోవరాజు, ఆర్‌బీకే చైర్మన్ గిద్దా సత్యనారాయణ పాల్గొన్నారు.

8న చంద్రబాబు పర్యటన

మధురపూడి: ఈనెల 8వ తేదీన జరిగే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లోని నాగసాయి కన్వెన్షన్ హాలులో శనివారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పరిశీలన తదితర కార్యక్రమాలున్నట్టు తెలిపారు. సమావేశంలో కంటే నాగ కేశవరావు, మింగి లక్ష్మీనారాయణ, తనకాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సారా తయారీ చేపడితే కఠిన చర్యలు

రంగంపేట: మండలంలో ఎవరైన సారా తయారీ, రవాణా, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ జి.వెంకట లక్ష్మి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ శుక్రవారం రాత్రి మర్రిపూడి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో పీత లోవకుమార్ అనే వ్యక్తి నుంచి 30 లీటర్ల సారా, శనివారం రంగంపేటలో నిర్వహించిన దాడుల్లో చింతపల్లి నాగమణి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. పీత బంగార్రాజు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామన్నారు. ఎవరైనా బెల్టు షాపులు, కోడి పందేలు, పేకాట నిర్వహించినా, గంజాయి రవాణా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీత లోవకుమార్ అనే వ్యక్తిని స్థానిక తహసీల్దార్ ఎం.దొరకయ్య వద్ద హాజరుపరచగా బైండోవర్ చేసినట్టు తెలిపారు.

పోలీసులపై దాడి అమానుషం

మధురపూడి: చిత్తూరు జిల్లా పుంగనూరులో పోలీసులపై టీడీపీ శ్రేణులు దాడిచేయడం అమానుషమని వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కో కన్వీనర్ గణేశుల పోసి, పార్టీ ప్రచారక విభాగం మండలాధ్యక్షుడు ఇందుగమెల్లి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పోలీసులపై దుర్భాషలాడటం, దాడులు చేయాలని శ్రేణులను ఉసిగొల్పడం దుర్మార్గమన్నారు. ప్రజల ప్రాణాలకు నష్టం కాకుండా పోలీసులు వ్యవహరించిన తీరును అభినందించారు.

జీవకారుణ్య సంఘం అభివృద్ధికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ జీవకారుణ్య సంఘాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. ఆ సంఘానికి దేవదాయ, ధర్మదాయ శాఖ నియమించిన నూతన పాలకవర్గంతో శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘ చైర్మన్‌గా బర్రే కొండబాబు, పాలకవర్గ సభ్యులుగా తమ్మిశెట్టి రాధిక, పైడా ఉష, అనంతలక్ష్మి, వీర వెంకటేశ్వరరావు, నాగులపల్లి దేవి, బత్తిన అన్నవరం, చల్లంగి ఏడుకొండలు, వెంకట రఘునందన్ ప్రమాణ స్వీకారం చేశారు. సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, పార్టీ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, మార్తి లక్ష్మి, పాలిక శ్రీను ఈట కే విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు అవగాహన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): న్యాయ సేవాధికార సంస్థల్లో పారా లీగల్ వలంటీర్లకు శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సామర్థ్య నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై, న్యాయసేవాధికార సంస్థల న్యాయసేవలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సేవలు అందించడంలో పారా లీగల్ వలంటీర్ల పాత్ర చాలా కీలకమన్నారు. లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రి దేవి మాట్లాడుతూ ప్లాపస్ విధులను వివరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఊలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఊలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఊలపల్లిలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చేయడం తమ ప్రభుత్వానికి అలవాటు లేదన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందేవన్నారు. కాని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అర్హతను బట్టే పథకాలు అమలుచేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని చెప్పారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని ఆయన కోరారు. అనంతరం రూ.12.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందారు రమ్య, వైస్ ఎంపీపీ పెంకే మంగయ్యమ్మ, ఎంపీటీసీ బందారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంద్రాల విజయశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బోడు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, గుళ్ళపల్లి రాంబాబు, బోడ రాజు బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



జి.మామిడాడలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ఆమె ప్రారంభించి ప్రీస్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్, గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో రేషన్‌ను ఇంటికే పంపిణీ చేస్తున్నారన్నారన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు కేతా సత్యశ్రీలక్ష్మి, కర్రి వెంకటపద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కేవస్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే కోరుకొండ సొసైటీకి లాభాలు



సభ్యులకు డివిడెండ్లు అందజేస్తున్న పాలక మండలి, అధికారులు

మధురపూడి: సమష్టి కృషితోనే కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి లాభాలు వచ్చాయని, దానిలో భాగంగానే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచి, ఉత్తమ అవార్డు సాధించామని ఆ సొసైటీ చైర్ పర్సన్ మారిశెట్టి తేజో వీరన్న నాయుడు అన్నారు. శనివారం పీఏసీఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంఘంలోని 3,200 మంది సభ్యులకు (వాటాదారులు) రూ.46.48 లక్షలు డివిడెండ్లుగా అందజేయడం సంతోషంగా ఉందన్నారు. 2016 -17 నుంచి 2021 - 22కి సంబంధించిన లాభాల్లోని 15 శాతం వాటాను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తన ఆధ్వర్యంలో పాలక మండలి 2021 జూలై 17న బాధ్యతలు తీసుకుందన్నారు. ఆ నాటికి సంఘం వ్యాపార టర్నోవర్ రూ.28,22 కోట్లు ఉందన్నారు. అది నేటికి రూ.44,15,57,000 చేరడంలో కార్యనిర్వాహక కార్యదర్శి, సిబ్బంది కృషి ఉందన్నారు. అనంతరం వాటాదారులకు డివిడెండ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ కోరుకొండ మేనేజర్ డీఎస్ఎస్ కిరణ్‌కుమార్, సొసైటీ మేనేజర్ జి. అప్పారావు, సీఈఓ గొట్టుముక్కల సుధాకరవర్మ, సూపర్ వైజర్ ఉల్లి విష్ణు ప్రసాద్, బూరుగుపూడి సొసైటీ సీఈఓ ఈదల సుదర్శనరావు, సొసైటీ పర్సన్లు జాజుల నాగేశ్వరరావు, సానబోయిన మణి మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవం జయప్రదం చేయాలి

పెదపూడి: ఈ నెల 9 నుంచి 15 వరకూ చేపట్టనున్న ఆజాదీకా అమృత్ మహోత్సవం జయప్రదం చేయాలని ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసుచౌదరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయం కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి ఆజాదీకా అమృత్ మహోత్సవం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు యాళ్ల ఉమామేశ్వరరావు, ఎం.త్రినాథ్, అచ్చిరాజు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ధర్నా



గోకవరంలో తహసీల్దార్ సుగుణకు వినతి పత్రం అందజేస్తున్న వరసాల కుమారి తదితరులు

గోకవరం: మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరసాల కుమారి అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా శనివారం గోకవరంలో మహిళలు, దళిత నాయకులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక దేవీచౌక్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరసాల కుమారి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను ఉరితీయాలన్నారు. ఘటనకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర సీఎం గద్దె దిగాలని, దీనిపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహసీల్దార్ సుగుణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు తుర్రం సత్యవతి, యానిమేటర్ ప్రమీల, సీసీలు నాగమణి, వెంకటలక్ష్మి, రాయుడు సరోజిని, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు పాల్గొన్నారు.

సోషల్ మీడియా అనుబంధ అధ్యక్షుల నియామకం

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగంలో అనుబంధ అధ్యక్షులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శనివారం ప్రకటించారు. రాజానగరానికి బత్తిన రాజ్‌కుమార్, కోరుకొండకు నాగ నవీన్ కుమార్, సీతానగరానికి గుమ్మడి వెంకటేష్ నియమితులయ్యారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత కామరాజు మాస్టారు ఇకలేరు



కామరాజు మాస్టారు(ఫైల్)

రంగంపేట: రంగంపేట మండలం చంద్రేడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ద్విభాష్యం కామరాజు(88) శనివారం మృతి చెందారు. ఆయన రాష్ట్రపతి అవార్డు గ్రహీత. చంద్రేడు గ్రామంలో పాఠశాల స్థాపించినప్పటి నుంచి ఆయన ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. విద్యారంగానికి ఆయన చేస్తున్న సేవలకు గాను 1986 సంవత్సరంలో ప్రభుత్వం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి అప్పటి రాష్ట్రపతి ఆర్.వెంకటరాఘవన్ చేతుల మీదుగా అవార్డు అందించి సత్కరించింది. కామరాజు మాస్టారు చంద్రేడు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ 1992లో రిటైర్ అయ్యారు. ఆయన ఉపాధ్యాయ వృత్తితో పాటు కవితలు రాసేవారు. చిత్రలేఖనం వేసేవారు. పాఠశాల నేమ్ బోర్డులు, తరగతి గదుల్లో బొమ్మలు వేసేవారు. కామరాజు మాస్టారు మృతిపై గ్రామ సర్పంచ్ జాస్తి వీర వెంకట పద్మావతి, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

జరిమానా రద్దుచేస్తే ఊరుకోం

రంగంపేట: అక్రమ మైనింగ్‌లో అధికారులు విధించిన జరిమానాను రద్దు చేస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రంగంపేట మండలం జి.దొంతమూరులో చుక్కమ్మ-చుక్కరాయుడు కొండలు తవ్వి అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఎమ్మెల్యే బినామీలైన వుయ్యూరు వీర్రాజు, నెల్లిమర్ల శ్రీనివాసరావులకు మైనింగ్ అధికారులు విధించిన రూ.9 కోట్ల జరిమానాను రద్దు చేయించడానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి రాష్ట్ర మైనింగ్ మంత్రి పెద్దిరెడ్డి వద్దకు వెళ్లారన్నారు. రద్దు చేస్తే మంత్రి పెద్దిరెడ్డిని కూడా కోర్టుకు లాగుతామని హెచ్చరించారు.

ఖర్చుకు తగ్గ ఫలితమేది!

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్



బిక్కవోలు ఉన్నత పాఠశాలలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్

బిక్కవోలు: ప్రభుత్వం విద్యార్థుల విద్యకు కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా, దానికి తగ్గ ఫలితాలు విద్యాశాఖ ఇవ్వడం లేదని రాష్ట్ర విద్యాశాఖ పిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన బిక్కవోలు మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల, ఊలపల్లిలోని నంబర్-1 ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ముందుగా ఆయన బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద తొమ్మిదో తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. అక్కడ పీఎస్ ఉపాధ్యాయుడు కె.శ్రీనివాస్ వద్ద ట్యాబ్ లేకపోవడంతో ఎందుకు ట్యాబ్ తీసుకురాలేదని అడిగారు. దీంతో ఇటీవల బదిలీపై శంఖవరం నుంచి వచ్చానని, అనారోగ్యంతో తీసుకురాలేదని శ్రీనివాస్ బదులిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ పిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ట్యాబ్‌ల కోసం రూ.1,500 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వాటిని సక్రమంగా ఉపయోగించుకోకపోతే ప్రయోజనమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఊలపల్లి నంబర్-1 ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. ఆయనను బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, బిక్కవోలు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి కలిశారు. కార్యక్రమంలో బిక్కవోలు ఎంఈవోలు సీహెచ్ సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, బిక్కవోలు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

సీతానగరం: సాగునీటి ప్రాజెక్టులపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని టీడీపీ మాజీ మంత్రి, రాజమహేంద్రవరం పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జి కేఎస్ జవహర్ ఆరోపించారు. శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, జోన్-2 ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవి యాదవ్‌లతో కలిసి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 8న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజమహేంద్రవరంలో ఉదయం బయలుదేరి తొర్రేడు, సీతానగరం మీదుగా పురుషోత్తపట్నం చేరుకుని ఎత్తిపోతల పథకాలను సందర్శించి, అక్కడ నుంచి సీతానగరం, కోటికేశవరం మీదుగా కోరుకొండ చేరుకుంటారన్నారు.

విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి

పెదపూడి: విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని కాకినాడ లయన్స్ క్లబ్ మైత్రీ అధ్యక్షురాలు ఎ.వెంకటలక్ష్మి అన్నారు. మండలంలో కుమారప్రియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 200 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి శనివారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్వర్యంలో నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు ముందుకొచ్చి దాతృత్వం చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్ కేఎల్ నారాయణరావు, ప్రతినిధులు రామకృష్ణ, వైవీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు పంపన సత్యనారాయణ, కె.రాజేష్, పాఠశాల కమిటీ ప్రతినిధి పి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నలనిధి రచయితగా దుర్గాప్రసాద్

కంబాలచెరువు: స్థానిక కంటిపూడి రామారావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ పాఠ్య పుస్తక రచయితగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ తెలుగు మరియు సంస్కృత అకాడమీ సంచాలకుల నుంచి ఉత్తర్వులు అందాదినట్టు ఆయన శనివారం తెలిపారు. దుర్గాప్రసాద్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమల దాస్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ మండల ఎంఈవో రజని అభినందించారు.

బీసీ సబ్‌ప్లాన్‌తోనే మహిళలకు న్యాయం

రాజమహేంద్రవరం సిటీ: మహిళల బిల్లులో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసినప్పుడే బీసీ మహిళలకు ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ సబ్ ప్లాన్ కల్పించాలని గత నెల 24న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళలతో నిర్వహించిన ధర్నాకు విశేష స్పందన లభించిందన్నారు. బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్‌కుమార్, లాలాచెరువు సత్యనారాయణ, కె.సుభాషిణి, కడలి సత్యనాయణ, మట్టా లక్ష్మి పాల్గొన్నారు.